## నేటి ధర్నాను విజయవంతం చేయాలి

● ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి



ఆసిఫాబాద్, మార్చి 5: ఎల్‌ఆర్‌ఎస్ పేరుతో ప్రజల నుంచి రూ. 20వేల కోట్లను దోచుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి మంగళవారం పిలుపునిచ్చారు. ఉచితంగా ఎల్‌ఆర్‌ఎస్‌తో పాటు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు బుధవారం ఆసిఫాబాద్ నియోజకవర్గంలో నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. 6న ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే కార్యాలయం వద్దకు చేరుకోవాల్సిందిగా కోరారు. 10 మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, సింగిల్ విండో చైర్మన్లు, వైస్ ఎంపీపీలు, మండల అధ్యక్షులు, ఎంపీటీసీలు. మాజీ సర్పంచులు, మాజీ వార్డు సభ్యులు, మహిళా నాయకులు, సీనియర్ నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, అభిమానులు, ప్రజలు పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.


# నమస్తే తెలంగాణ

## మంచిర్యాల
### కుమ్రం భీం ఆసిఫాబాద్

5 | బుధవారం 6 మార్చి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


## ఉత్తరాఖండ్‌లో ఆసిఫాబాద్ బృందం

-విద్యావిధానంపై పరిశీలన



ఉత్తరాఖండ్‌లో జిల్లా బృందం సభ్యులు

ఆసిఫాబాద్,మార్చి 5: ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన ఉపాధ్యాయుల బృందం పర్యటిస్తున్నది. అక్కడి ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమం అమలు తీరు, విద్యార్థుల అభ్యాసన ఫలితాలు, ఉపాధ్యాయులు అవలంబిస్తున్న వినూత్న బోధనా పద్ధతులు క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి రూమ్ టు రీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో క్వాలిటీ కో ఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్, ముత్యంపేట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు హన్మంతు, రూమ్ టు రీడ్ ఇండియా జిల్లా లీడ్ జెన్నిఫర్ రాణి డెహ్రాడూన్ జిల్లాలోని నౌగాం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మంగళవారం సందర్శించారు. అక్కడి విద్యావిధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించినట్లు వారు తెలిపారు. మధ్యాహ్న భోజనం అమలు తీరును కూడా పరిశీలించారు. సమగ్ర శిక్షా డిప్యూటీ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌తో చర్చా గోష్ఠిలో పాల్గొన్నట్లు తెలిపారు. రూమ్ టు రీడ్ రాష్ట్ర కో ఆర్డినేటర్ ప్రవీణ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కో ఆర్డినేటర్ నితిన్ పర్యవేక్షిస్తున్నారు.



వార్ధానదిపై వంతెన నిర్మించే ప్రదేశం

## వార్ధాపై వంతెన
# లేనట్లేనా..?

- రూ. 75 కోట్లు మంజూరు చేసిన కేసీఆర్ సర్కారు
- రద్దు చేసిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం
- జిల్లా ప్రజల్లో తీవ్ర ఆందోళన
- కౌటాలలో ప్రజాసంఘాల ధర్నా

కుమ్రం భీం ఆసిఫాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులో ప్రవహిస్తున్న వార్ధానదిపై గుండాయి పేట్ వద్ద వంతెన నిర్మాణానికి కేసీఆర్ ప్రభుత్వం గతంలో రూ. 75 కోట్లు మంజూరు చేసింది. కాగా, ఈ వంతెన నిర్మాణాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడంపై ప్రజల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు, వ్యాపార, వాణిజ్య సంబంధాలు పెంచాలనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం ఇక్కడ వంతెన నిర్మాణానికి సంకల్పించింది. ఈ ప్రాంత ప్రజలు కూడా ఇదే ఆశించారు. కౌటాల మండలంలోని గుండాయి పేట్ వద్ద వంతెన నిర్మాణం చేపడితే మహారాష్ట్రలోని చంద్రాపూర్, గడ్చిరోలి జిల్లాల ముఖ్యమైన రవాణా మార్గంగా మారుతుందని భావించారు. ఆసిఫాబాద్ జిల్లాలోని కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూర్, మండలాల ప్రజలకు మహారాష్ట్రలోని చప్రాడ, మార్కండ, గడ్చిరోలి జిల్లా కేంద్రానికి గోండ్ పిప్రి, బంగారంతలోది, ఆష్టి, విఠల్‌వాడ చాముర్షి ప్రాంతాలకు దాదాపు 40 నుంచి 60 కిలోమీటర్ల దూరం తగ్గేది. నాటుపడవలపై ఆధారపడి వార్ధా నదిని దాటాలంటే ఇరు రాష్ట్రాల ప్రజలు ఇబ్బందులు పడేవారు.

### అభివృద్ధి వైపు అడుగులు..

ఈ వంతెన నిర్మాణం పూర్తయితే జిల్లాలోని మారుమూల పల్లెలు వేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉండేది. ఇరు రాష్ట్రాల మధ్య వ్యాపార సంబంధాలు మెరుగయ్యేవి. ఇక జిల్లాలోని మారుమూల ప్రాంతాలైన కౌటాల, బెజ్జూర్, చింతలమానెపల్లి ప్రాంతాలు అన్ని రంగాల్లోనే అభివృద్ధి చెందేవి. భూముల ధరలు కూడా పెరుగుతాయని స్థానికులు ఆశించారు. అయితే ఈ ప్రాంత అభివృద్ధిని అడ్డుకునేలా కాంగ్రెస్ ప్రభుత్వం వంతెన నిర్మాణాన్ని రద్దు చేయడంపై వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. వార్ధాపై వంతెన నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని, ఈ ప్రాంత అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉండాలని డిమాండ్ చేస్తూ కౌటాల మండల కేంద్రంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు మంగళవారం ధర్నా చేపట్టారు.



వంతెన నిర్మించాలని ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

# ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్



దండేపల్లిలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి ఈశ్వర్

- సాధ్యం కాని హామీలతో అధికారం
- పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటుతాం
- ఈ ప్రాంతం నుంచే ప్రజాప్రతినిధిగా ఎదిగా..
- ప్రజలు అవకాశమిస్తే ఎంపీగా గెలిచి తీరుతా
- నమ్మకముంచిన అధినేత కేసీఆర్‌కు కృతజ్ఞతలు
- పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- మంచిర్యాల, దండేపల్లి, లక్షెట్టిపేటలో కార్యకర్తల సమావేశం
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్, మార్చి 5: సాధ్యం కాని హామీలతో కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందని, పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజల నుంచి గుణపాఠం ఖాయమని బీఆర్‌ఎస్ పెద్దపల్లి పార్లమెంటు అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మంచిర్యాలలోని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం, అనంతరం జరిగిన మంచిర్యాల, హాజీపూర్ బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటడం ఖాయమని స్పష్టం చేశారు. పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి చెందిందని, అందుకే ఈ ప్రాంతం అభివృద్ధికి, ముఖ్యంగా కార్మిక వర్గాల సమస్యలు పరిష్కరించేలా ఉన్నవారైతేనే బాగుంటుందని కేసీఆర్ తన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారన్నారు. తెలంగాణ ఏర్పడిన 10 ఏళ్లలో అన్ని ప్రాంతాలు, సాగునీరు, వ్యవసాయ రంగం, పట్టణాలు, పల్లెల ప్రగతికి ప్రణాళికతో కేసీఆర్ కృషి చేశారని గుర్తు చేశారు. విద్య, వైద్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని, అన్ని మతాల విశ్వాసాలను, మనోభావాలను కాపాడే విధంగా పనిచేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 90 రోజులు అవుతున్నదని, వంద రోజుల్లో పూర్తి చేస్తామన్న ఆరు హామీలపై ఇప్పుడు ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉంటుందని తెలిపారు. తాగునీరు, సాగునీరు, విద్యుత్ సరఫరా, రైతుబీమా, పెన్షన్లు, తదితర అంశాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గోదావరిఖనికి చెందిన వ్యక్తిగా, సింగరేణి కార్మికుడిగా, రామగుండం నుంచి రెండు సార్లు, ధర్మపురి నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా, కార్మిక నాయకుడిగా పనిచేసిన తనకు సమస్యల పరిష్కారంపై పూర్తి అవగాహన ఉందని అన్నారు. ప్రజలు తనకు సహకరించి అవకాశం ఇస్తే అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపై ఒత్తిడి తేవాలంటే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు మద్దతివ్వాలని కోరారు. తెలంగాణ కోసం కొట్లాడిన బీఆర్‌ఎస్ పార్టీని ప్రజలు ఆదరిస్తారని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు.

### క్యాడర్ సమాయత్తం కావాలి

దండేపల్లి, మార్చి5: పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపెల్లి పార్లమెంట్ పరిధిలో బీఆర్‌ఎస్ సత్తా చాటేందుకు పార్టీ క్యాడర్ సమాయత్తం కావాలని పెద్దపెల్లి ఎంపీ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు పిలుపునిచ్చారు. దండేపల్లి మండల కేంద్రంలోని పద్మశాలీ భవన్‌లో మంగళవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. అంతకుముందు గూడెం శ్రీసత్యనారాయణస్వామిని దర్శించుకొని, స్వామివారి ఆశీర్వచనాలు అందుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కేవలం సీట్లు, ఓటు బ్యాంకు మాత్రమే పెంచుకుంటామనే ఉద్దేశ్యంతో కాంగ్రెస్ పార్టీ అమలుకు సాధ్యం కాని హామీలను ప్రకటించిందన్నారు. తీరా వారు కూడా ఊహించని విధంగా అధికారంలోకి రావడంతో గంగదరగోళంగా పాలన నిర్వహిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ విషయాన్ని ప్రజలు కూడా గమనించి ఎందుకు ఓటు వేశామని బాధపడుతున్నారని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి ఎంపీ స్థానాన్ని బీఆర్‌ఎస్ పార్టీ గెలుచుకోవాలని, ఇప్పటి నుంచే గ్రామాల్లో ప్రచారం మొదలు పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ తిప్పని లింగయ్య, వైస్ ఎంపీపీ అనిల్, పీఏసీఎస్ చైర్మన్ కాసనగొట్టు లింగన్న, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు సత్యం, ఆయా గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



దండేపల్లిలో హాజరైన నాయకులు, కార్యకర్తలు

### గెలుపే లక్ష్యంగా పెట్టుకోవాలి

లక్షెట్టిపేట, మార్చి 5: పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. లక్షెట్టిపేటలోని విశ్రాంతి భవనంలో మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావుతో కలిసి పార్టీ నాయకులు, కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు బీఆర్‌ఎస్ పై గట్టి నమ్మకం ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై నిరాశ చెందాల్సిన అవసరం లేదని, కాంగ్రెస్ పార్టీపై నాలుగు రోజులకే ప్రజలకు విసుగు వచ్చిన విషయం అందరికీ తెలుసన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ నలుమాసు కాంతయ్య, డీసీఎమ్మెస్ చైర్మన్ తిప్పని లింగయ్య, పార్టీ మండల అధ్యక్షుడు చుంచు చిన్నయ్య, పట్టణ అధ్యక్షుడు పాదం శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు అంకతి రమేశ్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గోళ్ల రవీందర్, ఉపాధ్యక్షుడు ఆసాది పురుషోత్తం, పాల్గొన్నారు.

### పెద్దపల్లి ఎంపీగా కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలి

పెద్దపల్లి ఎంపీగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కోరారు. మూడునెలల కాలంలోనే ప్రజలు కాంగ్రెస్ పార్టీ అసలు స్వరూపాన్ని తెలుసుకున్నారని అన్నారు. డిసెంబర్ 9వ తేదీన రూ. 2 లక్షల రుణమాఫీ అని ప్రకటించి, ఇంతవరకు దాని ఊసే లేదని ఎద్దేవా చేశారు. 200 యూనిట్లు ఫ్రీ కరెంటులో కూడా కొర్రీలు కొర్రీలు పెడుతున్నారని మండిపడ్డారు. 15 వేల మంది సింగరేణి కార్మికులకు ఇండ్ల పట్టాలిచ్చిన ఘనత బీఆర్‌ఎస్‌దేనని గుర్తు చేశారు. మంచిర్యాల నియోజకవర్గంలో ప్రస్తుతం జరుగుతున్న పనులన్నీ కేసీఆర్ సర్కారు మంజూరు చేసినవేనని తెలిపారు. గతంలో ఎల్‌ఆర్‌ఎస్‌కు డబ్బు వసూలు చేయవద్దని అన్న కాంగ్రెస్ నాయకులే, ఇప్పుడు డబ్బులు కట్టాలని అంటున్నారని, ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని మండిపడ్డారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ మంచిర్యాల, నస్పూర్ పట్టణ అధ్యక్షులు గాదెసత్యం, సుబ్బయ్య, నాయకులు విజిత్‌రావు, గోగుల రవీందర్‌రెడ్డి, సందెల వెంకటేశ్, అంకం నరేశ్, శ్రీపతివాసు, బేర సత్యనారాయణ, రాజేంద్రపాణి, మండల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలు సజావుగా జరిగేలా ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

- రామగుండం సీపీ శ్రీనివాస్
- జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం

మంచిర్యాల ఏసీసీ, మార్చి 5: లోక్‌సభ ఎన్నికలు సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని రామగుండం సీపీఎం. శ్రీనివాస్ అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల పరిధిలోని రెవెన్యూ, ఎక్సైజ్, రవాణా శాఖల అధికారులు, పోలీస్ అధికారులతో ఎన్నికల నిర్వహణపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీసులంతా ఎన్నికల సంఘం నియంత్రణలో, క్రమ శిక్షణకు లోబడి పని చేయాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఎలాంటి పొరపాట్లు లేకుండా చూసుకోవాలని, ప్రతి అంశంపై అధికారులు సంపూర్ణ పరిజ్ఞానం కలిగి ఉండాలని పేర్కొన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి, బందోబస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. మద్యం, రేషన్ బియ్యం అక్రమ రవాణా, నిల్వలపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. అనుమానితులపై నిఘా పెట్టాలని, రౌడీ షీటర్లతో పాటు వివిధ కేసుల్లో ఉన్న వారిని బైండోవర్ చేయాలని పేర్కొన్నారు. సోషల్ మీడియాపై ప్రత్యేక దృ ష్టి పెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ అశోక్ కుమార్, ఏసీపీలు ఆర్.ప్రకాశ్, వెంకటేశ్వర్లు, రవికుమార్, రాఘవేంద్ర రావు, మల్లారెడ్డి, బెల్లంపల్లి ఆర్డీవోలు హరికృష్ణ, వీ రమేశ్, ఏస్పీసీ చంద్రకళ, డీటీవో సంతోష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# కనీస ప్రమాణాలు పాటించాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్
- అనాథాశ్రమాల నిర్వాహకులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్, మార్చి 5 : జిల్లాలో అనాథాశ్రమాల నిర్వాహకులు కనీస ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. నస్పూర్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా స్త్రీ శిశు, దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్యతో కలిసి అధికారులు, అనాథాశ్రమాల నిర్వాహకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని పిల్లల అనాథాశ్రమాలను పరిశీలన కమిటీ ఇప్పటికే సందర్శించిందని పేర్కొన్నారు. ఇకపై కూడా జిల్లా అధికారులు తనిఖీలు నిర్వహిస్తారని, నిర్వహకులు బాలల చట్టం ప్రకారం రిజిస్టర్లు, సీసీ టీవీలు, మెనూ ఇతర అన్ని అంశాలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆనంద్, ఇన్‌స్టిట్యూషనల్ కేర్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

### కలెక్టర్‌ను కలిసిన రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కొత్త పాలక మండలి సభ్యులు నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొత్త సభ్యులు మంచి కార్యక్రమాలు చేపట్టి, ప్రజలకు మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు. జిల్లా సహకార శాఖ అధికారి, ఎన్నికల అధికారి నర్సయ్య 15 మంది సభ్యులతో కూడిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నూతన పాలకమండలిని ప్రకటించారు. జిల్లా చైర్మన్‌గా కంకణాల భాస్కర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా బొప్పు సతీశ్, కోశాధికారిగా సత్యపాల్‌రెడ్డి, సభ్యులుగా మధుసూదన్‌రెడ్డి, చందూరి మహేందర్, కాసర్ల శ్రీనివాస్, కిషన్, శరత్‌కుమార్,చంద్రమోహన్, పవన్ కుమార్ తివారీ, సంతోష్‌కుమార్, సత్యనారాయణరెడ్డి, హరీశ్, సత్యనారాయణరావు, శంకరయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అధికారులు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సతీశ్‌కుమార్

## జాతీయ రహదారి సర్వే అడ్డగింత

హాజీపూర్, మార్చి 5: జాతీయ రహదారి 63 విస్తరణలో భాగంగా బైపాస్ రహదారి విస్తరణ కోసం చేపట్టిన భూ సర్వేను బుధవారం గుడిపేట రైతులు అడ్డుకున్నారు. మంచిర్యాల నుంచి నిజామాబాద్ వరకు నిర్మిస్తున్న గ్రీన్ హైవే జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మండలంలో రెవెన్యూ సిబ్బంది సర్వేను చేపట్టారు. నర్సింగాపూర్ గ్రామంలో సర్వేను పూర్తి చేసుకొని గుడిపేట గ్రామంలో రహదారి హద్దుల కోసం సర్వేను చేయడానికి సర్వేయర్లు రాగా భూములను కోల్పోతున్న గుడిపేట గ్రామ రైతులు వారిని అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న హాజీపూర్ తహసీల్దార్ సతీశ్ కుమార్ వెళ్లి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం అందించే నష్ట పరిహారం ఏ మాత్రం సరిపోదని, మా భూ ములు తీసుకుంటే ఆత్మహత్యలే శరణ్యమని భూ సర్వేను నిలిపి వేయాలని తహసీల్దార్‌కు విన్నవించారు. అన్ని భూములను పరిశీలించిన తర్వాత సంబంధిత అధికారులు వచ్చి నష్ట పరిహారం నిర్ణయిస్తారని, రైతులకు న్యాయం జరుగుతుందని తహసీల్దార్ సముదాయించారు. సర్వే చేయనివ్వాలని చెప్పగా, రైతులు ససేమిరా అనడంతో అధికారులు వెనుదిరిగారు.

## కంపు కొడుతున్న కాలనీలు..



పట్టణంలోని రాజీవ్ నగర్‌లో డ్రైనేజీ కంపుతో ముక్కు మూసుకొని వెళ్తున్న విద్యార్థులు

మంచిర్యాల మున్సిపాలిటీలోని పలు కాలనీలు కంపుకొడుతున్నాయి. పారిశుధ్య పనుల నిర్వహణ సరిగ్గా లేక చెత్తాచెదారం పేరుకుపోయి దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా రాజీవ్ నగర్, ఎన్టీఆర్ నగర్ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాజీవ్ నగర్‌లో పాఠశాలకు వెళ్లే ప్రధాన మార్గం దుర్గంధం వెదజల్లుతుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ముక్కు మూసుకొని ఆ దారి వెంట వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. కాలనీల్లో చెత్త పేరుకుపోయిన పలు దృశ్యాలను 'నమస్తే' క్లిక్ మనిపించింది.

- మంచిర్యాల స్టాఫ్ ఫొటోగ్రాఫర్





పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌లో చెత్తాచెదారం